క్లుప్తంగా

కూలింగ్ చలివేంద్రాలు ప్రారంభం



అంబేడ్కర్ కూడలిలో కూలింగ్ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న భీమిలి జెడ్పీ కనకమహాలక్ష్మి

తగరపువలస: స్థానిక మణికంఠ స్వీట్స్ అండ్ బేకరీ యాజమాన్యం మంగళవారం ప్రధాన రహదారిలో ముఖ్యమైన నాలుగు కూడళ్ల వద్ద కూలింగ్ చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. రూ.2 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన వీటిని భీమిలి జెడ్పీ కనకమహాలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఆదిమూలం నాగరాజు, సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవుళ్లు, వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి, వర్తక సంఘం అధ్యక్షుడు దుర్గా మురళి, కొప్పల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

'మా సంఘంతో సంబంధం లేదు'

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి సోమన్నపాలెం శ్రీ కంచికామాక్షి రజక సేవా సంఘం అధ్యక్షుడిగా చెలామణీ అవుతున్న నరవ బసవయ్యకు, సంఘానికి సంబంధం లేదని సంఘం అధ్యక్షుడు ఎస్.అప్పలరాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బసవయ్య అనే వ్యక్తి టీడీపీలోనే వుంటూ మరలా టీడీపీలో చేరినట్లుగా ప్రకటన చేయడమే కాకుండా రజక సేవా సంఘం అధ్యక్షుడిగా చెలామణీ కావడాన్ని ఖండిస్తున్నామన్నారు. టీడీపీ నాయకులు చీప్ ట్రిక్స్ మానుకోవాలని హెచ్చరించారు. మా రజకులకు ఏ ప్రభుత్వం అండగా వుందో, సంక్షేమ పథకాలు అందించిందో ఆ ప్రభుత్వానికే మద్దతుగా నిలుస్తామని తెలిపారు. ఆయనతోపాటు ఉపాధ్యక్షుడు కె.తాతారావు, సెక్రటరీ ఎం.అప్పలరాజు, పి.నాగరాజు వున్నారు.

శ్రీవారికి నందకం ఆభరణం బహూకరణ



నందకం ఆభరణాన్ని అర్చకుడికి అందిస్తున్న సత్యానందరావు కుటుంబ సభ్యులు

భీమునిపట్నం: భీమిలి కృష్ణాకాలనీ కొండపై నున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామికి ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం నందకం ఆభరణం బహూకరించారు. ముమ్ముడిశెట్టి సత్యానందరావు, రమాదేవి దంపతులు రూ.1.50 లక్షల విలువ చేసే వెండి నందకం ఆభరణాన్ని ఆలయ అర్చకులు అప్పలాచారికి బహూకరించారు. శ్రీవారి అలంకణ సమయంలో దీన్ని ఇకపై వినియోగిస్తారు. అనంతరం ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం నిర్వహించారు. డాక్టర్ ముమ్ముడిశెట్టి ఆదిత్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మ తిరునాళ్లు



పాట్నూరు నూకాలమ్మ ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

పద్మనాభం: మండలంలోని పాట్నూరు నూకాలమ్మ ఆలయం వద్ద మంగళవారం సాయంత్రం తిరునాళ్లు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. పాట్నూరు, రెడ్డిపల్లితోపాటు పరిసర గ్రామాలైన తునివలస, శేరిఖండం, భద్రయ్యపేట, సంగుపేట గ్రామాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

వైభవంగా ఉగాది వేడుకలు

- వేకువజాము నుంచే ఆలయాలకు భారీగా భక్తులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు



సువర్ణ పుష్పాలంకరణలో శ్రీ లక్ష్మీనారాయణులు



శ్రీవారి సన్నిధిలో పంచాంగం వినిపిస్తున్న నరసింహాచార్యులు

కొమ్మాది: క్రోధి నామ తెలుగు నూతన సంవత్సర (ఉగాది) వేడుకలు పలు ఆలయాల్లో మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవమూర్తులకు నూతన పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు నరసింహాచార్యులు పంచాగం చదివి వినిపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్లు శివకృష్ణ, శ్రావణ్ పర్యవేక్షించారు.

అష్టలక్ష్మి సన్నిధిలో...

స్థానిక అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్టలక్ష్మి సన్నిధిలో తెలుగు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవ, అలంకరణ, అర్చన, తోమాల సేవ నిర్వహించి 132 సువర్ణ సంపంగి పూలతో శ్రీ లక్ష్మీనారాయణులకు సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. శ్రీ లక్ష్మీనారాయణులకు వజ్రకవచాధారణచేసి భక్తులకు దర్శనం కల్పించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి తెలిపారు. సాయంత్రం పంచాంగం చదివి వినిపించారు. అనంతరం సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

మధురవాడ : తెలుగు సంవత్సరాది శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. మధురవాడ పరిసర ప్రాంతాల్లోని ఆలయాల్లో స్వాములకు ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. పూజలకు పరిసర ప్రాంతాల భక్తులు విశేషంగా హాజరయ్యారు. ఆయా ప్రాంతాల్లో షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో కమిటీ సభ్యులు పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు, పీకేఎం పాత్రుడు, నాగోతి తాతారావు తదితరులు, మధురవాడ ఐటీ సెజ్ జంక్షన్ మానం ఆంజనేయులు కాలనీలో గల శ్రీ లలిత త్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వర స్వామి ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, ప్రతాపరాజు, తదితరుల ఆధ్వర్యంలో అర్చకులు పంచాంగం చదివి వినిపించారు.



చంద్రంపాలెంలో పూజలందుకున్న దుర్గాలమ్మ

- పీఎం పాలెం – బక్కన్నపాలెం రోడ్డులో గల శ్రీ శృంగేరి మఠంలో వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వాములకు విశేష అలంకరణ చేశారు. కార్యక్రమాలను వేంకటేశ్వర్లు పర్యవేక్షించారు.



పీఎంపాలెం ఆఖరి బస్టాప్ వద్ద అలంకరణలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి

గంభీరంలో ఉగాది వేడుకలు

ఆనందపురం : మండలంలోని గంభీరంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం వైకుంఠ నిర్మాణ ప్రదేశంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా వేద పండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. తెలుగు ఏడాది కాలంలో ప్రజలకు జరిగే మేలు, కీడును వివరించారు. అనంతరం పండితులు మానవాళి మేలు కోరి హరేకృష్ణ అఖండ హరినామ సంకీర్తన, శ్రీ నరసింహ యజ్ఞం నిర్వహించారు. భక్తులకు ఉగాది పచ్చడి అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రెసిడెంట్ నిష్కించిన భక్త దాస, అంబరీష పాల్గొన్నారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో ఉగాది వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.



గంభీరంలో పూజలు నిర్వహిస్తున్న పండితులు

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు



మొక్కజొన్న, తులసిమాలలు, గజమాలతో కొత్తమ్మ తల్లి



కరెన్సీ నోట్లు, పువ్వుల గుత్తులతో మజ్జివలస రాస పోలమాంబ



బంతి, తులసి మాలలతో తాటితూరు పైడితల్లమ్మ

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మతల్లిని మంగళవారం మొక్కజొన్నలు, తులసి మాలలు, గజమాలలతో అలంకరించారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో ఈ అలంకరణకు జీరు రాంబాబు, లక్ష్మి సహాయ సహకారాలు అందించారు. భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు, సంతపేటకు చెందిన దుంప శంకరరావు అమ్మవారిని అలంకరించారు. భీమిలి మండలం మజ్జివలస పంచాయతీకి చెందిన రాస పోలమాంబను కరెన్సీ నోట్లు, పూలమాలలతో అలంకరించారు. ఈ అలంకరణకు, ప్రసాదాల పంపిణీకి కాగితాలపేటకు చెందిన కాగితాల రెడ్డి బ్రదర్స్, పెదవాల్తేరుకు చెందిన కాగితాల అచ్చిల్ రెడ్డి, అప్పయ్యమ్మ, ఆదమ్మ, తుపాకుల అప్పలరాసయ్య, రాసమ్మ సహాయ సహకారాలు అందించారు. తాటితూరు పంచాయతీ గ్రామదేవత పైడితల్లమ్మను బంతిపూల మాలలు, తులసి మాలలతో ఆలయ కమిటీ ప్రతినిధులు అలంకరించారు.

సీఎం జగన్‌తోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి



కణమాంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఇంటింటా ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు

ఆనందపురం : వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని, అందుకోసం ఆయన్ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు కోరారు. మండలంలోని కణమాంలో మంగళవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకూ మేలు జరిగే విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పథకాలు అమలు చేశారని చెప్పారు. మరలా ఆయననే ముఖ్యమంత్రిని చేసుకుంటేనే అన్ని వర్గాలకూ న్యాయం జరుగుతుందన్నారు. టీడీపీ, జనసేన కూటమి నాయకులు చెప్పే కల్లబొల్లి కబుర్లు నమ్మి మోసపోవద్దని సూచించారు. అందరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భీమిలి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, మండల జేసీఎస్ కన్వీనర్ గంట్రెడ్డి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పాండ్రింకి శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు గొలగాని కృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పిన్నింటి వెంకటరమణ, చందక అప్పలస్వామి, పినిశెట్టి సింహాచలం నాయుడు, ఎర్ర అప్పలనాయుడు, లెంక రాంబాబు, కోరాడ ముసిలినాయుడు, బంక తాతారావు, షిణగం శ్రీను, కోరాడ వెంకట రమణారావు, ఎర్ర కన్నారావు, యర్ర అప్పలరాజు, పడాల రాము, ఎరుకొండ అప్పలరాజు, కోండ్రోతు అప్పలనారాయణ, షిణగం రాంబాబు, అక్కిరెడ్డి దేముడు, కోండ్రోతు అప్పలనారాయణ పాల్గొన్నారు.

నూకాలమ్మ దర్శనానికి భారీగా భక్తులు



అమ్మవారిని దర్శించుకుని వస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



వైద్య శిబిరంలో సేవలు అందిస్తున్న సిబ్బంది

భీమునిపట్నం: భీమిలి గ్రామ దేవత శ్రీనూకాలమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉగాది సందర్భంగా అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉదయం ఆరు గంటల నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. నూకాలమ్మ వారిని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు అందరిపైనా వుండాలని కోరుకున్నట్టు తెలిపారు. ఉదయం పది గంటల తర్వాత భక్తుల సంఖ్య బాగా పెరిగిపోవడంతో పోలీసులు, ఉత్సవ నిర్వాహకులు అదుపు చేయడానికి చాలా ఇబ్బందులు పడ్డారు. మెయిన్‌రోడ్డులోని అమ్మవారి చదురుపట్టు ఎదురుగా పీపుల్ పవర్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు నిమ్మకాయల భాస్కర్ పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతమి దివ్యశ్రీ ఇక్కడకు వచ్చిన వారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించడంతోపాటు ఎండకు సొమ్మసిల్లిన వారికి ప్రథమ చికిత్స అందించారు. సభ్యులు శివ, గోపీనాథ్, తేజ, గణేష్, జగదీశ్వరరావు పాల్గొన్నారు. అలాగే పలువురు దాతలు స్వచ్ఛందంగా భక్తులకు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు.

ఉచిత హిందీ శిక్షణ తరగతులు ప్రారంభం

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ – చెన్నై ఆధ్వర్యంలో ఈ ఏడాది సెప్టెంబరులో జరగనున్న హిందీ లోయర్, హయ్యర్ పరీక్షలకు సంబంధించి ఉచిత శిక్షణ తరగతులను ఆదర్శహిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు మంగళవారం ప్రారంభించారు. పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, ప్రవేశిక, రాష్ట్ర భాష, రాష్ట్ర భాష విశారద పూర్వార్థ, రాష్ట్ర భాష విశారద ఉత్తరార్థ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్థ, రాష్ట్ర భాష ప్రవీణ ఉత్తరార్థ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ ఉచిత శిక్షణ తరగతులు వినియోగించుకోవాలని కోరారు.

ఆదివారం, ఇతర సెలవు దినాల్లో ఉచిత శిక్షణ తరగతులు భీమిలిలో నిర్వహిస్తామన్నారు. జాతీయ భాష హిందీని పలువురు నేర్చుకోవడం, మరికొందరికి సిఫారసు చేయడం ద్వారా జాతీయ సమైక్యతకు దోహదపడాలని కోరారు. వివరాలకు 89856 47419, 89858 97419లో సంప్రదించాలని కోరారు.

'శిలాఫలకానికి తెరవేయాలి'

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్టపై మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారాం పేరు మీద ఉన్న శిలాఫలకానికి ఎన్నికల సంఘం అధికారులు పరదా వేయకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఈ ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ పేరుతో ఉన్న శిలాఫలకాలు, విగ్రహాలను మూసివేసిన అధికారులకు టీడీపీకి చెందిన ఈ మాజీ ఎమ్మెల్యే శిలాఫలకం కనిపించకపోవడం శోచనీయమని అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి ఎన్నికలు ముగిసే వరకు ఈ శిలాఫలకానికి తెరవేయాలని బంగ్లామెట్ట వాసులు కోరుతున్నారు.



బంగ్లామెట్టపై మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారాం పేరుతో ఉన్న శిలాఫలకం

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

మధురవాడ: సమాజంలో జర్నలిస్టుల పాత్ర చాలా కీలకమని పీఎం పాలెం పోలీస్ ఇన్‌స్పెక్టర్ వై.రామకృష్ణ అన్నారు. మధురవాడలోని మా మీడియా హబ్ కార్యాలయంలో స్మార్ట్ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉగాది సంబరాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం జర్నలిస్టులకు స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్మార్ట్‌సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బంగారు అశోక్, ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టులకు మిఠాయిలు పంచి పెడుతున్న సీఐ రామకృష్ణ

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆనందపురం : మండలంలోని పలు ప్రాంతాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆపరేషన్ జోన్ – 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆనందపురం, బాకురుపాలెం, పందలపాక ఐటీ బీపీ సబ్‌స్టేషన్ల పరిధిలో గల విద్యుత్ లైన్లలో మరమ్మతులు చేపట్టనున్నామన్నారు. ఈ మేరకు లొడగలవానిపాలెం, నేళ్తేరు, పందలపాక, జగ్గరాజుపాలెం, బీఆర్‌బీ కాలనీ, బాకురుపాలెం, చిన్నయ్యపాలెం, ఇచ్ఛాపురం, ముచ్చర్ల, రేగానిగూడెం, రామునేనిపేటలో గల గృహ, పారిశ్రామిక వినియోగదారులకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు.

పద్మనాభం: పద్మనాభం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని రేవిడి ఫీడర్‌కు మరమ్మతులు చేపట్టనున్నందున బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విశాఖపట్నం ఆపరేషన్ జోన్ – 3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. రేవిడి, బర్లపేట, కొండ బర్లపేట, కురపల్లి, పాండ్రంగి గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

ఎన్నికల ప్రచారం నేడు

పద్మనాభం: మండలంలోని మూడు పంచాయతీల్లో బుధవారం వైఎస్సార్ సీపీ భీమునిపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు తెలిపారు. కోరాడ, బి.తాళ్లవలస, బుడ్డివలస – అగ్రహారం పంచాయతీల్లో ప్రచారం నిర్వహించనున్నట్టు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు కోరాడ నుంచి ప్రారంభం కానున్న ప్రచారానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

నృసింహుడికి విశేష పూజలు

- శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం
- వైభవంగా గరుడసేవ

సింహాచలం: ఉగాది పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం 1001నామాలను పఠిస్తూ స్వామికి అర్చన చేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.



నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో గరుడవాహనంపై గోవిందరాజస్వామిని అధిష్టంపజేసి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. అర్చకుడు కుమారాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఆనందపురం : మండలంలోని బాకురుపాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ శివ తెలిపారు. బాకురుపాలెంలో ఓ షాపులో మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్ఐ శివ, సిబ్బంది మంగళవారం ఆకస్మికంగా దాడి చేశారు. ఈ మేరకు 27 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని, ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ శివ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మద్యం, నిందితుడుతో పోలీసులు

నవ్వులు కురిపించిన 'చల్ చల్ గుర్రం'

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మురళీనగర్ వాకర్స్ పార్కు ఆవరణలో మంగళవారం సాయంత్రం ఉగాది వేడుకలు సాంప్రదాయ సిద్ధంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. సుసరావు చంద్రశేఖ శర్మ పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం విశాఖ సాయి స్నేహ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రంగస్థల, సినీ నటుడు ఎస్.కె.మిశ్రో, మిశ్రో ప్రియశిష్యుడు ప్రముఖ రంగస్థల, సినీ నటుడు మాచిరాజు నారాయణరావును వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి చేతుల మీదుగా సత్కరించారు. మాచిరాజు నారాయణరావు సమర్పణలో ప్రముఖ నటులు ఎస్.వి.ఎల్.ఎన్ ప్రసాద్ 'మిమిక్రి', ఆకట్టుకుంది. ఎస్.వి.ఎల్.ఎన్ ప్రసాద్ దర్శకత్వంలో ప్రదర్శించిన ప్రముఖ రచయిత, ప్రఖ్యాత సినీ నటుడు తనికెళ్ళ భరణి రచించిన చల్‌చల్ గుర్రం హాస్య నాటిక నవ్వులు కురిపించింది. క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు, ఆర్.సత్యనాథం, కె.ద్వారకానాథ్, తదితరులు పాల్గొన్నారు.



సినీ నటుడు ఎస్.కె.మిశ్రో, నటుడు మాచిరాజు నారాయణరావులకు సత్కారం